సాక్షి
మెదక్
మంగళవారం ׀ 31 ׀ జనవరి ׀ 2023



ఆరోగ్య 'యోగ'ం
నేషనల్ ఆయుష్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో యోగా కేంద్రాలు నిర్మించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో



ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ
ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందిన ఘటన తూప్రాన్ పట్టణ సమీపంలోని తూప్రాన్– నర్సాపూర్ రహదారిపై చోటు చేసుకుంది. 8లో



కేజ్‌వీల్స్‌తో బీటీరోడ్లకు నష్టం
బీటీరోడ్డుపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడవడంతో రోడ్డు దెబ్బతిని త్వరగా పాడవుతున్నాయని, సీఎం కేసీఆర్‌తో మాట్లాడి చట్టం చేసేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. 9లో

కష్టాల ఉల్లి.. కన్నీరు మిగిలి

ధర లేక రైతన్న విలవిల

- తగ్గిన దిగుబడి
- జిల్లాలో 1,286 ఎకరాల్లో పంట
- రేగోడ్ మండలంలో అత్యధికంగా సాగు



పంటను చూస్తూ దిగాలు చెందుతున్న రైతు

రేగోడ్(మెదక్): ఆరుగాలం కష్టపడి పండించిన ఉల్లి పంటకు ధర లేక రైతులు నష్టపోతున్నారు. గతేడాదిని పోల్చితే ఈయేడు పూర్తిగా ధర పడిపోవడంతో ఉల్లి రైతులు లబోదిబో మంటున్నారు. గతేడాది క్వింటాల్ ఉల్లిగడ్డకు సుమారు రూ.2,800లు ధర పలకగా, ఈసారి రూ.600–900ల వరకు ధర పలికింది. దీంతో సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేని ఆందోళన చెందుతున్నారు.

- జిల్లాలో గతేడాది 1,502 ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేయగా.. ఈయేడు 1,286 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలోని ఆయా మండలాల్లో కంటే రేగోడ్ మండలంలో అత్యధికంగా 1,213 ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశారు.
- ఉల్లి పంటపైనే ఆధారపడి సాగు చేసిన రైతులకు ఇబ్బంది తప్పడం లేదు. అదే విధంగా ఎకరం ఉల్లిపంట సాగుకు రూ.80 వేలు పెట్టుబడి అవుతోంది. పంట చేతికి వచ్చిన తర్వాత పంటను కోసేందుకు రూ.25 వేలు ఖర్చు అయింది.
- గతేడాది ఎకరానికి సుమారు వంద క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈ సారి కేవలం ఎకరానికి యాభై క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చింది.
- ఎకరానికి రూ.30–35 వేలు నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం మద్దతు ధర లేకపోవడంతో ఉల్లిగడ్డను చేనుల వద్ద కొందరు, ఇళ్లల్లో కొందరు నిల్వ చేస్తున్నారు.
- కోసిన ఉల్లిగడ్డ ఎక్కువ రోజులు నిల్వ ఉంచడంతో పాడవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతేడాదికంటే ఎక్కువ సాగు

- రేగోడు మండలంలో 17 వేల ఎకరాల విస్తీర్ణం భూమి ఉంది. గతేడాది 967 ఎకరాల్లో ఉల్లి పంట తక్కువ సాగు చేయగా దిగుబడి కూడా ఎక్కువగానే వచ్చింది.
- ఈసారి 1,213 ఎకరాల్లో సాగు చేస్తే తక్కువ దిగుబడి వచ్చిందని రైతులు వాపోతున్నారు.

కోల్డ్ స్టోరేజ్ ఎక్కడ?



రైతు నిల్వ చేసిన పంట

- రేగోడ్‌లో ఉల్లిగడ్డ కోల్డ్ స్టోరేజ్ భవనాన్ని ఏర్పాటు చేయాలని గతంలో పలుమార్లు కోరినా ప్రభుత్వాలు స్పందించడం లేదని ఉల్లి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ప్రతీసారి ఉల్లిపంటను సాగు చేసి నిల్వ కోసం నానా కష్టాలు పడుతున్నామని చెబుతున్నారు. పంట ఎక్కడ పడితే అక్కడ నిల్వ ఉంచడంతో ఉల్లిగడ్డ పాడై నష్టం వస్తుందని మండిపడుతున్నారు.
- అదే విధంగామద్దతు ధర ప్రకటించి అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

క్వింటాల్‌కు రూ.2 వేలు ప్రకటించాలి



11 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశాను. గతేడాది ఎకరానికి వంద క్వింటాళ్ల దిగుబడి రాగా ఈ సారి యాభై క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. అప్పుడు క్వింటాల్‌కు రూ.2,800 ధర పలకగా ఈసారి రూ.600 నుంచి రూ.900 మాత్రమే ఉంది. ఉల్లి సాగు చేసి తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం స్పందించి క్వింటాల్‌కు రూ.2 వేలు మద్దతు ధర ప్రకటించాలి.

– చంద్రశేఖర్, రైతు పోచారం

కోల్డ్ స్టోరేజ్‌కి ప్రతిపాదనలు



జిల్లాలోని రేగోడ్ మండలంలో రైతులు అత్యధికంగా ఉల్లి పంటను సాగు చేస్తున్నారు. గతేడాదికంటే ఈసారి దిగు బడి తగ్గింది. పంట నిల్వ చేసేందుకు కోల్డ్‌స్టోరేజ్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం.

–జావీద్, ఏఓ,రేగోడ్

చట్ట ప్రకారం పరిష్కరించండి

ఎస్పీ రోహిణీప్రియదర్శిని



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రోహిణీప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: ప్రజావాణికి బాధితుల నుంచి ఫిర్యాదులను చట్ట ప్రకారం పరిష్కరించాలని పోలీస్ అధికారులకు ఎస్పీ రోహిణీప్రియదర్శిని సూచించారు. సోమవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఇందులో కొంపల్లి చెందిన నాగోల్ వినీల ఫిర్యాదు చేస్తూ.. నిజాంపేట మండలం కే.వెంకటాపూర్‌కు చెందిన లలిత, శిల్పలతల వద్ద 3 ఎకరాల 37 1/2 గుంటల పట్టా భూమిని 2022లో కొన్నామని తెలిపారు. ఆ భూమిని సర్వే చేయించగా 28 1/2 గంటల భూమి తక్కువ ఉన్నట్లు తేలిందన్నారు. ఈ విషయాన్ని అడిగితే నీ ఇష్టం వచ్చిన చోట చెప్పుకో మేము డబ్బుల తిరిగి ఇచ్చేది లేదంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాల ని కోరారు. ఫిర్యాదుకి తగిన న్యాయం చేయాలని ఎస్పీ రామాయంపేట సీఐకి సూచించారు. కొల్చారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కృష్ణ తన భార్య డిసెంబర్ నెలలో పుట్టింటికి వెళ్లి తిరిగి రావడం లేదని తెలిపారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం చెప్పడం లేదని, ఇంటికి రావడం లేదన్నారు. స్పందించిన ఎస్పీ చట్ట ప్రకారం ఫిర్యాదుకి తగిన న్యాయం చేయాలని కొల్చారం ఎస్ఐకి సూచనలు చేశారు.

న్యూస్‌రీల్

నకిలీ జామీన్‌పై కలెక్టర్‌కు నివేదిక

సాక్షి కథనంతో విచారణ

శివ్వంపేట(నర్సాపూర్): నకిలీ ఫోర్జరీ జామీన్ పత్రాల గురించి 'సాక్షి దినపత్రిక'లో ఆదివారం ప్రచురితమైన 'నకిలీ జామీన్ కేరాఫ్ చెన్నాపూర్' కథనంపై విచారణ ప్రారంభమైంది. గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీతో జామీన్ ఇచ్చిన విషయం వాస్తవమేనని ఎంపీడీఓ నవీన్‌కుమార్ తెలిపారు. నకిలీ రశీదులతోపాటు వారి వద్దనున్న స్టాంపులతో సంతకాలు చేసి కోర్టుల్లో గుర్తు తెలియని వ్యక్తులకు జామీన్ ఇచ్చారన్నారు. జామీన్ ఇచ్చిన తేదీల పత్రాలు పరిశీలించగా ఆ రోజు కార్యదర్శి నుంచి ఎలాంటి జామీన్ పత్రాలు జారీ కాలేదన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు కలెక్టర్ హరీశ్‌కు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

బదిలీలు , పదోన్నతులపై హెల్ప్ డెస్క్

మెదక్ కలెక్టరేట్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలపై ఏమైనా సందేహాలుంటే డీఈఓ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని డీఈఓ రమేశ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పని చేస్తున్న అన్ని క్యాటగిరీలకు సంబంధించిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల విషయమై సందేహాలు తీర్చేందుకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తమ సమస్యలు, సందేహాలపై సీనియర్ సహాయకులు శైలేందర్ కుమార్ (90326 25295), జూనియర్ సహాయకులు వనజ (91825 76654), డీఎల్ఎంటీ మహేశ్ (94920 39644), నర్సింహారెడ్డి (98484 08840) సంప్రదించాలని తెలిపారు.

'మన ఊరు-మన బడి' పనులు పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను సోమవారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి సందర్శించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న మన ఊరు- మన బడి పనులను పరిశీలించి స్కూల్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఫిబ్రవరి ఒకటిన మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ఫంక్షన్ హాల్‌తోపాటు ఇతర అభివృద్ధి పనులు ప్రారంభం కానున్న సందర్భంగా అభివృద్ధి పనులను సమీక్షించినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ బొడ్డు శంకర్, ఎంపీటీసీ స్రవంతి, మాజీ సర్పంచ్ ఉడుత సిద్దయ్య, ఉప సర్పంచ్ పాల్గొన్నారు.

మైనార్టీ రుణాలకు అధిక యూనిట్లు కేటాయించాలి

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో మైనార్టీలకు రుణాలను జనాభా ప్రాతిపదికన అధిక యూనిట్లను కేటాయించాలని మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ జితెందర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. జనాభా ప్రాతిపదికన రామాయంపేటకు కనీసం 20 యూనిట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రెండు మంజూరు చేశారని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

మనోహరాబాద్(తూప్రాన్): పశువులకు వ్యాధులు సంక్రమించకుండా టీకాలు వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి విజయ్‌శేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మనోహరాబాద్ మండలం కాళ్ళకల్ గ్రామంలో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో జిల్లా అదనపు పశువైద్య సంచాలక అధికారి వెంకటయ్య, ఎంపీపీ పురం నవనీతరవితో కలిసి పశువులకు టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. తూప్రాన్ ఉమ్మడి మండల పశువైద్యురాలు లక్ష్మీ, మంజుల, రామస్వామి, నిస్సార్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

మెదక్ కలెక్టరేట్: దివ్యాంగులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని, అలాగే జీవో 17 ను వెంటనే రద్దు చేయాలని జాతీయ దివ్యాంగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బస్వరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులతో కలిసి నిరసన తెలిపి అదనపు కలెక్టర్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బస్వరాజ్ మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు యశోద, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆగమయ్య, ఇతర వికలాంగులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్

వెబ్‌పోర్టల్‌లో అప్‌డేట్ చేయండి

అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణిలో వచ్చే అర్జీలను త్వరగా పరిష్కరించి వెంటనే వెబ్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని అదనపు కలెక్టర్ రమేశ్ అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 52 అర్జీలను డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీఎస్ఓ శ్రీనివాస్ తో కలిసి స్వీకరించారు. ఇందులో డబుల్ బెడ్రూం ఇళ్లు కావాలని 10 విజ్ఞప్తులు రాగా, ధరణి, భూ సమస్యలకు సంబంధించి 27, మిగతా 15 వివిధ శాఖలకు సంబంధించినవి వచ్చాయన్నారు. ఆయా శాఖ అధికారులకు అందజేస్తూ ప్రతీ అర్జీని ప్రజావాణి వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుడికి సైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఏఓ యూనుస్ పాల్గొన్నారు.

గొప్ప వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలి

నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి అనిత



హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న జడ్జి అనిత

నర్సాపూర్ : గొప్ప వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని అంకిత భావంతో లక్ష్యాన్ని సాధించి ఉన్నతస్థాయికి ఎదగాలని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత విద్యార్థినులకు సూచించారు. సోమవారం ఆమె పట్టణంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. చట్టాలపై, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. హాస్టల్ ఎదుట మురికి కాల్వ ఉందని దుర్వాసన రావడంతోపాటు దోమలు వస్తున్నాయని, దీంతో ఇబ్బంది పడుతున్నామని హాస్టల్ సంక్షేమ అధికారి గాయత్రీ, విద్యార్థినులు జడ్జి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి మండల లీగల్ సర్వీస్ కమిటీ ప్రతినిధులు తీసుకెళ్తారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలు అవుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలిసి హాస్టల్‌లో పరిశీలించారు. జడ్జి వెంట ఎస్ఐ గంగరాజు, న్యాయవాది స్వరూపరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలి

రాష్ట్ర నాయకులు బండ కార్తీకరెడ్డి



మాట్లాడుతున్న కార్తీకరెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): బీజేపీ వైపు ప్రజలు చూస్తున్నారని వారి ఆదరణతో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, హైదరాబాద్ మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీని ధీటుగా ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అభివృద్ధికి సంబంధించిన 18 తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. వీటి విషయంలో అధికార పార్టీపై ఒత్తిడి పెంచేందుకు అవసరమైన ఉద్యమ కార్యాచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రామ్మోహన్ గౌడ్, నర్సాపూర్ మున్సిపాల్ చైర్మన్ మురళీ యాదవ్, జెడ్పీ మాజీ చైర్మన్ బాలయ్య, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జనార్దన్ రెడ్డి, శింగాయిపల్లి గోపీ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, విజయ్, సురేశ్, రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి రాజశేఖర్, రఘువీరారెడ్డి, నందారెడ్డి, పార్టీ మోర్చాల అధ్యక్షులు వీణ, యాదగిరి, మల్లారెడ్డి, రెడ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు పోగుల రాజు, రాచర్ల అశోక్, సురేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

మెదక్ కలెక్టరేట్: పశుసంవర్ధక శాఖ పరిధిలో పనిచేస్తున్న పశు మిత్రలకు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్థక శాఖ పరిధిలో పశుమిత్ర పేరుతో జంతువులకు ఆరోగ్యపరమైన సేవలు ఎలాంటి పారితోషకం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేయించుకుంటుందన్నారు. ఎనిమిదేళ్ల నుంచి సేవలు అందిస్తున్నా వారికి కనీస వేతనం ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పశు మిత్రలు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ పథకాలు

అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్



అద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

అల్లాదుర్గం(మెదక్): అవినీతి, దళారీ వ్యవస్థ లేకుండా పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. సోమవారం గడిపెద్దాపూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి అద్దాలు అందజేశారు. అల్లాదుర్గంలో పీఏసీఎస్ భవన నిర్మాణానికి శంకుస్థాపన, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, కంటి వెలుగు, కేసీఆర్ కిట్టు, ఆసరా పింఛన్ తదితర పథకాలు అన్ని రాష్ట్రాలలో అమలు చేసేందుకే సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ తులసీరాం టెలీకాం అడ్వైజరీ కమిటీ జిల్లా సభ్యులు కాశీనాథ్, ఎంపీపీ అనిల్ కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నర్సింలు, చెన్నకృష్ణ గౌడ్, లేఖీ రమేశ్, బచ్చు రమేశ్, బాలుగౌడ్, అంజయ్య యాదవ్, భేతయ్య, ప్రభు, అమ్మయమ్మ, డాక్టర్ పాజీయ , చెన్నప్ప పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ పర్యటన సాగిందిలా..



పరిశ్రమలో ఏర్పాటు చేసిన విభాగాలను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్



కేటీఆర్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి, హేమలత, తదితరులు

తూప్రాన్, మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ మండలంలోని దండుపల్లి గ్రామ శివారులో రూ.450 కోట్లతో సుమారు 59 ఎకరాల్లో ఐటీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరిశ్రమను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం 11.12 నిమిషాలకు పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. పరిశ్రమ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్‌పూరి, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్‌లు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

- 11.16 నిమిషాలకు పరిశ్రమ తయారు చేసిన ఉత్పత్తులను స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన వాటిని మంత్రి పర్యవేక్షించారు.
- 11.20 నిమిషాలకు పరిశ్రమలో ఏర్పాటు చేసిన నిర్మాణాల విభాగాల నమూనాను పరిశీలించారు.
- 11.33 నిమిషాలకు వేదిక వద్దకు చేరుకున్నారు.
- 11.35కు జ్యోతి ప్రజ్వలన చేశారు.
- 11.45కు ఐటీసీ పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆయా రంగాల్లో చేపడుతున్న ఉత్పత్తులు, సేవలను వీడియో ద్వారా వీక్షించారు.
- 11.53 నిమిషాలకు పరిశ్రమ ఉత్పత్తులు, ప్రభుత్వం అందిస్తున్న సేవలపై సుదీర్ఘంగా 20 నిమిషాలపాటు ప్రసంగించారు.
- 12.14 నిమిషాలకు పరిశ్రమ నిర్వాహకులు మంత్రి కేటీఆర్‌కు జ్ఞాపికను అందజేశారు.
- 12.30 నిమిషాలకు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్, మనోహరాబాద్ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి పరిశ్రమ నిర్వాహకులతో కలిసి భోజనం చేశారు.
- 12.45 నిమిషాలకు రోడ్డు మార్గం ద్వారా మేడ్చల్ మీదుగా హైదరాబాద్ తిరిగి వెళ్లారు.

కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్టారెడ్డి, ఎంపీపీ పురం నవనీత, మండలశాఖ అధ్యక్షుడు పురం మహేశ్, ఎంపీటీసీ లతా వెంకట్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పోడు భూమి పట్టాలిచ్చేందుకు ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు పోడుభూమి పట్టాలిచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర స్థాయి ఉన్నతస్థాయి అధికారులతో కలిసి మంత్రి సత్యవతి రాథోడ్ జిల్లా కలెక్టర్లతో కంటి వెలుగు, మన ఊరు మన బడి, పోడు భూములు, పామ్ ఆయిల్, టీచర్‌ల బదిలీలు, జీఓ 58, 59 లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ పోడు భూముల పట్టాల పంపిణీ అనంతరం మరో ఇంచ్ భూమి కూడా ఆక్రమణకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌లకు సూచించారు. జిల్లా నుంచి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పాల్గొని మాట్లాడారు. కంటి వెలుగుకు సంబంధించి ఆన్‌లైన్‌లో సరిగ్గా కనిపించని 515 మంది వివరాలను సరి చేసి తిరిగి అప్‌లోడ్ చేస్తామన్నారు. పోడు భూములకు సంబంధించి సబ్ డివిజన్ స్థాయి నుంచి జిల్లా స్థాయి కమిటీకి వచ్చిన 182 క్లెయిమ్స్‌ను త్వరలో పరిశీలించి అర్హులకు పోడు పట్టాలు ఇచ్చేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మన ఊరు మన బడి కింద 15 పాఠశాలలో పనులు పూర్తి చేసిన వాటిని ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించడానికి జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ జిల్లా వైద్యాధికారి చందు నాయక్, అటవీ శాఖాధికారి రవి ప్రసాద్, బీసీ అభివృద్ధి అధికారి కేశూరం, డీఈఓ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరం పరిశీలన

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం పేట ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణపై ఆమె ఆరా తీశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియతోపాటు కంటి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. కంటి అద్దాలు, మందులు అందిస్తున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈరోజు ఎంత మందికి పరీక్షలు నిర్వహించి అద్దాలు అందించారని అడిగారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ సాయి సింధు, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌తో మాట్లాడారు. ఇప్పటి వరకు ఎన్ని గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఎంత మందికి పరీక్షలు జరిగాయని ఆరా తీశారు, ఎక్కడైనా ఏవైనా సమస్యలు వచ్చాయా, సజావుగానే జరుగుతున్నాయా అని ప్రశ్నించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యక్రమాన్ని కొనసాగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కంటి వెలుగు డాక్టర్ చందనా, కంటి పరీక్షల నిర్వాహకుడు నాగరాజు, ఏఎన్ఎం మాధవి, నాగలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు మాలతీ, రేణుక, ఆశవర్కర్ లలిత పాల్గొన్నారు.

క్లుప్తంగా

అత్తతో గొడవపడి కోడలు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: భూమి విషయంలో అత్త, కోడలు గొడవపడిన ఘటనలో కోడలు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం సింపురం గ్రామానికి చెందిన లక్ష్మి తన కూతురు మల్లేశ్వరిని 15 ఏళ్ల క్రితం బచ్చుగూడెంకు చెందిన కృష్ణతో వివాహం జరిపించింది. అనారోగ్యంతో కృష్ణ ఎనిమిది సంవత్సరాల క్రితం మృతిచెందగా.. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం భూమి విషయంలో అత్త పున్నమ్మకు కోడలు మల్లేశ్వరికి గొడవ జరిగింది. దీంతో మల్లేశ్వరి తల్లికి ఫోన్ చేసి గొడవ జరిగింది.. నేను ఇంటి నుంచి వెళ్లిపోతున్నాను అని చెప్పింది. తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సర్పంచ్‌ను బెదిరించిన వ్యక్తి అరెస్ట్

ఝరాసంగం(జహీరాబాద్): మహిళా సర్పంచ్‌ను చంపుతానని బెదిరించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిల్కపల్లికి చెందిన బేగరి బిచ్చప్ప అదే గ్రామానికి చెందిన సర్పంచ్ పట్లోళ్ల ఇంద్రమ్మ ఇంటికి ఈనెల 25వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో వెళ్లి అసభ్యంగా తిడుతూ రాయితో కొట్టి చంపుతానని బెదిరించాడు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు సోమవారం బిచ్చప్పను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

రేగోడ్(మెదక్): డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి మెదక్ ప్రత్యేక మొబైల్ కోర్టు జడ్జి కల్పన ఒక రోజు సాధారణ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ సోమవారం రాత్రి తెలిపారు. గతేడాది మే 29వ తేదీన మండలంలోని తాటిపల్లి వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా.. నారాయణఖేడ్ నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న ఇద్దరు మద్యం తాగి వాహనాలు నడుపుతూ వేర్వేరుగా పట్టుబడ్డారని తెలిపారు. కేసు నమోదు చేయగా.. మెదక్ ప్రత్యేక మొబైల్ కోర్టు జడ్జి కల్పన ఒక రోజు సాధారణ జైలు శిక్ష విధించారని చెప్పారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సంజు కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట పట్టణ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్, నాయకులు అంజి, అరవింద్, మధు, ప్రశాంత్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

‘దళితబంధు’ అమలులో నిర్లక్ష్యం సరికాదు

దుబ్బాక: దళిత బంధు పథకాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి శంకర్ ఆరోపించారు. మండల కేంద్రమైన రాయపోల్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. దళిత బంధు పథకం అమలులో నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు పాల్గొన్నారు.

ఆరోగ్య యోగం

- ఆయుర్వేద ఆస్పత్రుల్లో యోగా కేంద్రాలు
- జిల్లాకు 16 మంజూరు
- ఒక్కో కేంద్రానికి రూ. ఆరు లక్షలు మంజూరు



సిద్దిపేట పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మించిన యోగా కేంద్రం

సాక్షి, సిద్దిపేట: యోగా ప్రాముఖ్యతను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదిశగా అడుగులు వేస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో యోగా కేంద్రాలు నిర్మించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాయి. నేషనల్ ఆయుష్ మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో యోగా కేంద్రాలు నిర్మించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 421 యోగా కేంద్రాలను మంజూరు చేయగా అందులో జిల్లాకు 16 కేంద్రాలను మంజూరు చేశారు. ఒక్కో కేంద్రానికి రూ. 6 లక్షల చొప్పున మొత్తం రూ. 96 లక్షలను ఇప్పటికే మంజూరు చేయగా.. త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

జిల్లావ్యాప్తంగా 16 ఆయుష్ ఆస్పత్రుల్లో యోగా కేంద్రాలు మంజూరయ్యాయి. అక్కన్నపేట, అల్లిపూర్, చిన్నగుండవెల్లి, ఇటిక్యాల, కొండపాక, మర్కూక్, నారాయణరావుపేట, పోతారెడ్డిపేట, ఆకునూరు, దుద్దెడ, ప్రజ్ఞాపూర్, మిరుదొడ్డి, మద్దూరు, తొగుట, సిద్దిపేట (హౌసింగ్ బోర్డు కాలనీ), రాయపోలు ఆయుష్ వెల్‌నెస్ సెంటర్లకు మంజూరు చేశారు.

- ఇందులో 10 చోట్ల యోగా కేంద్రాలకు షెడ్ నిర్మాణం పూర్తికాగా మర్కూక్, కొండపాక, ప్రజ్ఞాపూర్, అల్లిపూర్‌లో పనులు ఇంకా ప్రారంభం కాలేదు. మద్దూరులో నిర్మాణంలో ఉంది.
- నేషనల్ ఆయుష్ మిషన్ నిబంధనల ప్రకారం గాలి, వెలుతురు సోకే విధంగా, 18 ఫీట్ల వెడల్పు, 21 ఫీట్ల పొడవులో నిర్మాణం ఉండే విధంగా అధికారులు డిజైన్ రూపకల్పన చేశారు.
- ఇప్పటికే యోగా కేంద్రాల పనులు పలు చోట్ల పూర్తకాగా.. మరికొన్ని చోట్ల పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి.
- ప్రస్తుతం ప్రజలు వివిధ రకాల ఆహారపు అలవాట్లతో తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారన్న విషయాన్ని ధ్రువీకరించి పల్లెలు, పట్టణాల్లో యోగా కేంద్రాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.
- జిల్లాలో యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్న యోగా కేంద్రాల్లో ప్రతీ కేంద్రానికి ఇద్దరు యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు.
- యోగాను మరింత విస్తరించి ప్రజల ఆరోగ్యం దిశగా అడుగులు వేసేందుకు కృషి చేస్తున్నారు.

దీర్ఘకాలిక రోగాలకు చెక్

ప్రతీ రోజు యోగా చేయడం వల్ల దీర్ఘకాలిక రోగాలకు చెక్ పెట్టవచ్చు. జిల్లావ్యాప్తంగా 16 చోట్ల యోగా కేంద్రాలు మంజూరయ్యాయి. అందులో 10 షెడ్‌ల నిర్మాణాలు ఇప్పటికే పూర్తి కాగా మరొకటి నిర్మాణ దశలో ఉంది. మరో ఐదు చోట్ల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తాం.

– రవికుమార్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, ఆయుష్

మాటిచ్చారు.. చోటిచ్చారు



యోగాపై మంత్రి హరీశ్‌రావు మహిళలకు వివరిస్తున్న వైనంపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనం (ఫైల్)



మంత్రి కేటాయించిన గ్రంథాలయ భవనంలో యోగా అభ్యసనాలు

సిద్దిపేటజోన్: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం అభివృద్ధి చెందుతుందని, మీరు యో గా, ధ్యానం చేస్తానంటే వసతి కల్పిస్తానని మహిళలకు మంత్రి హరీశ్‌రావు మాటిచ్చాడు. ఇచ్చిన మాట ప్రకారం వారికి వసతి కల్పించాడు. ఇటీవల సంతోషిమాత దేవాలయంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు వచ్చి మంత్రిని యోగా అభ్యసన కోసం పాత గ్రంథాలయ భవనం కేటాయించాలని కోరిన విషయం తెలిసిందే. ఈమేరకు మంత్రి సూచనలకు అనుగుణంగా గ్రంథాలయంను యోగా, ధ్యానం కోసం మహిళలకు కేటాయించారు. సోమవారం మహిళలు, పురుషులు అక్కడే యోగా అభ్యసనం చేశారు. ఈసందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

దుబ్బాక ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్



మహిళ కడుపులో 5.5 కేజీల గడ్డను తొలగించిన వైద్యులు

దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి మహిళ కడుపులో నుంచి 5.5 కేజీల గడ్డను తొలగించారు. దౌల్తాబాద్ మండలానికి చెందిన బేకరి రాధిక (38) రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతుంది. అనేక ప్రైవేట్ ఆస్పత్రులు తిరిగినా ఫలితం లేకపోవడంతో రెండు రోజుల క్రితం దుబ్బాక ఆస్పత్రికి వచ్చింది. దీంతో ఆమెకు వైద్య పరీక్షలు చేసి కడుపులో లార్జ్ ఫైబ్రాయిడ్ గడ్డ ఉందని గుర్తించారు. ఈక్రమంలో సూపరింటెండెంట్, సర్జన్ హేమరాజ్‌సింగ్ ఆధ్వర్యంలో సుమారు గంటన్నరకు పైగా ఆపరేషన్ నిర్వహించి రాధిక కడుపులో ఉన్న సుమారు 5.5 కేజీల గడ్డను తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులు వైద్యులను అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంట్లో చిందర వందరగా పడి ఉన్న దుస్తులు, సామగ్రి

నర్సాపూర్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన నర్సాపూర్‌లో జరిగింది. పట్టణంలోని అరిగే కృష్ణవేణి ఆదివారం తమ ఇంటికి తాళం వేసి బంధువుల వద్దకు వెళ్లింది. సోమవారం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో 22 తులాల వెండి పట్ట గొలుసులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ఆదివారం రాత్రి ఓ వ్యక్తి పలు ఇళ్లలో చోరీకి యత్నించి చివరకు పట్టణవాసుల చేతికి చిక్కాడు. అతడిని పోలీసులకు అప్పగించారు. పట్టణంలోని పలు వీధుల్లో చోరీకి యత్నించాడు. పాష ఇంటి తాళం ధ్వంసం చేసి లోపలికి వెళ్లి బీరువాను తెరిచి అందులో ఉన్న వస్తువులను చిందరవందర చేశాడు. ఇంట్లో ఏమి దొరకకపోవడంతో వెనుదిరిగాడు. అనంతరం పట్టణంలోని ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీకి యత్నించగా ఉపాధ్యాయుడు అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి చోరీకి యత్నించిన వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందుతుడి వద్ద ఓ మోటార్ సైకిల్, ల్యాప్‌టాప్ ఉన్నట్లు స్థానికులు చెప్పారు. ఈవిషయమై స్థానిక ఎస్‌ఐ గంగరాజును వివరణ కోరగా పట్టణ ప్రజలు పట్టించిన వ్యక్తిని విచారిస్తున్నామని చెప్పారు.

గీత కార్మికుడికి గాయాలు



గాయపడిన రాములు

చేర్యాల(సిద్దిపేట): తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు గాయపడిన సంఘటన మండల పరిధిలోని తాడూరులో సోమవారం చోటు జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొడిగె రాములుగౌడ్ కులవృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో కాలు జారి కింద పడ్డాడు. ఈ ఘటనలో నడుము, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రాములును ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి..



తీవ్ర గాయాలతో గుర్తు తెలియని యువకుడు

సంగారెడ్డి టౌన్: మండల పరిధిలోని ఎమ్మెన్నార్ చౌరస్తా వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తిని వాహనం ఢీకొనగా ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్టు సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐ కుర్షిద్ తెలిపారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనగా యువకుడు ప్రాణాపాయల స్థితిలో ఉన్నాడని.. ఫిర్యాదు అందిందని వెంటనే అంబులెన్స్‌లో గాయపడిన వ్యక్తిని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని చెప్పారు. ప్రాణపాయ స్థితిలో ఉండగా చికిత్స నిమిత్తం గాంధీకి తరలించినట్టు చెప్పారు. వ్యక్తి వివరాలు తెలియవన్నారు. తెలిసినవారు 8712656746 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కుక్కల దాడిలో దుప్పి హతం



రామాయంపేట(మెదక్): పట్టణ శివారులో సోమవారం తెల్లవారుజామున దారితప్పి జనారణ్యంలోకి వచ్చిన చుక్కల దుప్పిపై ఊర కుక్కలు దాడి చేసి హతమార్చాయి. కుక్కలు దుప్పిని తరుముతుండగా, సమీపంలో ఉన్న రైతులు దానిని రక్షించి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. అప్పటికే తీవ్రంగా గాయపడిన దుప్పి మృత్యువాత పడింది. దీంతో పోస్టుమార్టం నిమిత్తం దుప్పి కళేబరాన్ని వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కన్నపేట అటవీ ప్రాంతంలో దహనం చేశారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

ఇద్దరు దుర్మరణం.. మరో ముగ్గురికి తీవ్రగాయాలు



దుర్గం భాస్కర్ మృతదేహం



యాదగిరి మృతదేహం

తూప్రాన్: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందిన సంఘటన పట్టణ సమీపంలోని తూప్రాన్- నర్సాపూర్ రహదారిపై టాటా కాఫీ పరిశ్రమ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేశ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణ పరిధిలోని 7వ వార్డు అల్లాపూర్‌కు చెందిన దుర్గం భాస్కర్ (35), రొడ్డ గణేశ్‌గౌడ్, కుంట నర్సింలు ముగ్గురు మేస్త్రీ పనులు చేస్తారు. బైక్‌పై శివ్వంపేట మండలం శభాష్‌పల్లిలో ఇంటి నిర్మాణ పనులు ముగించుకొని బైక్‌పై అల్లాపూర్‌కు వస్తున్నారు. అలాగే చిన్న శంకరంపేట మండలం చందంపేటకు చెందిన తాటికొండ యాదగిరి (32) తన బైక్‌పై రెడ్డి నర్సింలుతో కలిసి నర్సాపూర్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తూప్రాన్-నర్సాపూర్ రహదారిపై టాటా కాఫీ పరిశ్రమ సమీపంలో మూడుగుళ్ల మైసమ్మ దేవాలయం వద్ద రెండు బైక్‌లు అతివేగంగా ఢీకొన్నాయి. ఈఘటనలో భాస్కర్ (35), తాటికొండ యాదగిరి అక్కడికక్కడే మృతి చెందారు. రెండు బైక్‌లపై వెనుకాల కూర్చున్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అన్నదమ్ముల మధ్య భూవివాదం..

తమ్ముడి ఆత్మహత్యాయత్నం



కాలిన గాయాలతో కృష్ణ

హత్నూర(సంగారెడ్డి): అన్నదమ్ముల మధ్య జరిగిన భూవివాదంలో తమ్ముడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈసంఘటన మండల కేంద్రమైన హత్నూరలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన దుర్గోళ్ల కృష్ణకు ఇద్దరు అన్నలు పోచయ్య, బలరాం ఉన్నారు. తనకు రావాల్సిన రెండు గంటల భూమిని ఇవ్వడం లేదని.. దీనికి తోడు ఇటీవల భూమిని సైతం అమ్ముకున్నారని కృష్ణ ఆరోపించాడు. అంతేకాకుండా తరచూ పోలీస్ స్టేషన్ పిలిపించి పోలీసులతో బెదిరుస్తున్నారని వాపోయాడు. ఇదే విషయమై సోమవారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్‌కు ముగ్గురు అన్నదమ్ములు రాగా.. తాము ఏమి చెప్పలేమని, మీరు బయటకెళ్లి మాట్లాడుకోవాలని చెప్పినట్టు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. ఈక్రమంలో పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వచ్చిన కృష్ణ పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. అక్కడే ఉన్న కొందరు యువకులు గమనించి వెంటనే మంటలను ఆర్పివేశారు. అనంతరం 108లో సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



రాజు(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): పంటల సాగుకు చేసిన అప్పు తీర్చే మార్గంలేక తీవ్ర మనస్తాపానికి గురై ఓ యువరైతు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసంఘటన మండలంలోని గుబ్బడి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గీకురి రాజు(34) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల నూతనంగా ఇల్లు నిర్మించుకోగా అవసరాల కోసం దాదాపుగా రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. ఈనేపథ్యంలో చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక ఆందోళనతో మనస్తాపానికి గురై వ్యవసాయ బావివద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజుకు భార్య నిర్మల, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాశ్ కథనం ప్రకారం.. కల్హేర్ మండలం ఇంద్రనగర్‌కు చెందిన నర్సింలు (42) బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడలో ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య పిల్లలు స్వగ్రామంలో ఉండగా బీరంగూడలో ఒక్కడే నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నర్సింలు సోమవారం తెల్లవారుజామున ఇంట్లో సీలింగ్ రాడ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న అమీన్‌పూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

స్కూటీ అదుపుతప్పి ఒకరి మృతి

మరొకరికి తీవ్రగాయాలు



విశ్వనాథ్(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: స్కూటీ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు పట్టణానికి చెందిన విశ్వనాథ్ (57) ఆదివారం రాత్రి మండల పరిధిలోని పోచారంలో ఫంక్షన్‌కు స్నేహితుడు శ్రీనుతో కలసి స్కూటీపై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో స్కూటీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడింది. ప్రమాదం నుంచి తెరుకున్న శ్రీను పోచారం గ్రామానికి చెందిన స్నేహితుడు విక్రమ్‌కు ఫోన్‌లో తెలిపాడు. దీంతో ఘటనాస్థలానికి చేరుకుని ఇద్దరిని తన కారులో పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరిశీలించిన వైద్యులు విశ్వనాథ్ మరణించినట్లు ధ్రువీకరించారు. గాయపడిన శ్రీను చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

మాకు న్యాయం చేయండి



సీఐ సంజయ్‌కు ఫిర్యాదు చేస్తున్న లక్ష్మీపురం ప్లాట్స్ యజమానులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూర్‌లో తమ ఇంటి స్థలాలను ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని కొల్లూరు లక్ష్మీపురం ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు విలేకరులతో మాటాడుతూ.. 40 ఏళ్ల క్రితం కొల్లూరులో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేశా మని.. ప్రస్తుతం భూముల విలువ పెరగడంతో తమ ప్లాట్లను ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని వాపోయారు. సోమవారం తమ ఇంటి స్థలాల వద్దకు వెళ్లగా కొందరు జేసీబీలతో పని చేస్తున్నారని వారిని.. ప్రశ్నిస్తే ఓ మంత్రి పేరు చెప్పి బెదిరిస్తున్నారని తెలిపారు. తమ ప్లాట్లను అక్రమంగా ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి గల్లంతు



గాలిస్తున్న గజ ఈతగాళ్లు

దుబ్బాక: ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వ్యక్తి గల్లంతైన సంఘటన రాయపోల్ మండలం ఆరెపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొంపల్లి బాలయ్య బంధువు ఇటీవల మృతిచెందగా దశదినకర్మ సందర్భంగా బంధువులతో కలిసి స్థానిక చెరువులోకి స్నానం కోసం వెళ్లాడు. చెరువులోకి దిగి స్నానం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బాలయ్య నీట మునిగాడు. గమనించిన తోటి బంధువులు బాలయ్యను కాపాడే ప్రయత్నం చేసినా ఆచూకీ లభించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడే వరకు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది.

ఎమ్మెల్యే బుజ్జగింపులు ఫలించేనా?



చైర్‌పర్సన్ ఇంటి వద్ద కౌన్సిలర్లు, నాయకులతో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): తారాస్థాయికి చేరిన చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ కుర్చీ కొట్లాట ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి బుజ్జగింపులతో ముగిసిపోతుందా అని పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. సోమవారం మండల పరిధిలోని కడవేర్గులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే చైర్మన్ పదవి ఆశిస్తున్న 7వ వార్డు కౌన్సిలర్ జుబేదా ఖతూన్, 6వ వార్డు కౌన్సిలర్ యాట కనకమ్మతో కలిసి చైర్‌పర్సన్ ఇంటికి భోజనానికి వెళ్లారు. భోజనం చేస్తూ కార్యకర్తలు, నాయకులతో మాట్లాడిన ఎమ్మెల్యే అనంతరం 7వ వార్డు కౌన్సిలర్ జుబేదా ఖతూన్ ఇంటికి వెళ్లి అక్కడ సుమారు గంట సేపు చర్చలు జరిపినట్లు సమాచారం. ఇది ఇలా ఉంటే చైర్‌పర్సన్ ఇంట్లో భోజనానికి వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, మరో ఇద్దరు కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీశ్ గైర్హాజరైనట్లు తెలిసింది. స్థానికంగా లేని కారణంగా వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, నరేందర్ గైర్హాజరు కాగా అప్పటివరకు ఎమ్మెల్యేతో కార్యక్రమంలో పాల్గొన్న చంటి, సతీశ్ వెళ్లకపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. చైర్మన్ ఇంట్లో సహపంక్తి భోజనాలు, జుబేదాఖతూన్ కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే సుదీర్ఘ చర్చలు అవిశ్వాస ప్రక్రియకు అడ్డుకట్ట వేస్తాయా అనేది వేచి చూడాలి.

కాలకృత్యాలకు వెళ్లి.. చెరువులో మునిగి

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



నర్సింలు(ఫైల్)

వర్గల్(గజ్వేల్): కాలకృత్యాలకు చెరువు వద్దకు వెళ్లిన రైతు కాలుజారి అందులోనే మునిగి మృతిచెందిన సంఘటన మండలంలోని అనంతగిరిపల్లి శివారులో సోమవారం జరిగింది. గౌరారం ఎస్సై సంపత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వేలూరుకు చెందిన రైతు చాకలి నర్సింలు (47)కు కొద్దిపాటి వ్యవసాయ భూమి ఉంది. రోజు మాదిరిగా సోమవారం ఉదయం పొలానికి వెళ్లాడు. సమీపంలోని అనంతగిరిపల్లి శివారు చెరువు వద్ద కాలకృత్యాలు తీర్చుకుంటూ కాలుజారి చెరువులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో అందులోనే మునిగి మృతిచెందాడు. ఉదయం వెళ్లిన తండ్రి భోజనానికి ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కొడుకు అతని కోసం వెతికారు. అనంతగిరిపల్లి శివారులోని చెరువు అంచు వద్ద చెప్పులు, టవలు కన్పించడంతో అనుమానంతో అందులో వెతకగా మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య నర్సవ్వ, ముగ్గురు కుమారులు ఉన్నారు. పొలానికి వెళ్లొస్తాడనుకున్న రైతు చెరువులో శవమై కన్పించడంతో నర్సింలు కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజగోపాల్‌పేటలో..



చంద్రయ్యగౌడ్(ఫైల్)

నంగునూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన రాజగోపాల్‌పేటలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాళ్లపల్లి చంద్రయ్యగౌడ్ (44) ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం అతడి కోసం కుటుంబ సభ్యులు వెతకగా గ్రామంలోని పెద్ద చెరువులో చేపల వలకు చిక్కి మరణించినట్లుగా గుర్తించారు. కుమారుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.